క్లుప్తంగా

తిమ్మగురుడి పల్లకోత్సవం



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

గూడూరు: పట్టణంలో తిమ్మగురుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి పల్లకీ, గరుడ సేవ నిర్వహించారు. ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పల్లకీలో కూర్చోబెట్టి ఊరేగింపు నిర్వహించారు. అలయ అధికారులు మురళీ, అర్చకుడు తిమ్మగురుడు, భక్తులు పాల్గొన్నారు.

కొత్తకోట ఎడ్ల విజేత

గూడూరు: పట్టణంలో తిమ్మగురుడు స్వామి తిరుణాలను పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన ఎద్దుల బండ లాగుడు పోటీలను మాజీ కేంద్రమంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో కొత్తకోట కు చెందిన డాక్టర్ గురునాథ్ వృషభాలు ప్రథమ బహుమతి , వర్కూరు తిరుమలేష్ వృషభాలు 2 వ బహుమతి, అనంతపురం జిల్లాకు చెందిన నాగేశ్వరెడ్డి వృషభాలు 3 వ బహుమతి, కంచిపాడు కు చెందిన సుధాకర్ వృషభాలు నాలుగో బహుమతి సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆయా వృషభాల యజమానులకు వరుసగా రూ.40, రూ. 30, రూ. 20, రూ.10 వేల చొప్పున నగదు అందించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకరరెడ్డి, చంద్రారెడ్డి, బతుకన్న, రాజారెడ్డి, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై దృష్టి

కోడుమూరు రూరల్: భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ శేషఫణి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. చి ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లోని రైతుల నుంచి భూసమస్యలపై వచ్చే అర్జీలను ప్రత్యేకంగా పరిశీలించడంతో పాటు వీఆర్వోల ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు, ఏఈ ప్రసాద్, ఏపీఎం పుష్పావతి, ఈఓఆర్డీ మంజుల ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమాతో భరోసా

కల్లూరు: వైఎస్సార్ బీమా బాధిత కుటుంబాలకు భరోసా ఇస్తుందని 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. 73వ వార్డు సచివాలయం పరిధిలోని రుక్మిణి నగర్‌లో నివాసం ఉంటున్న పింజరి ఖాసిం ఆదివారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించాడు. ఖాసింకు వైఎస్సార్ బీమా ఉండటంతో నామిని పింజరి మాబ్బీకి సోమవారం మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోండి

కర్నూలు(హాస్పిటల్): ఈ మండు వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. సోమవారం బుధవారపేటలోని మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులకు 'అందరికీ జీవనశైలి, మన ఆరోగ్యం-గృహవైద్యం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో వ్యాదులకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ముఖ్యంగా ఆత్మన్యూనతాభావానికి గురిగాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార, విహార, నడక, వ్యాయామం, ప్రాణాపాయం, ధ్యానం, యోగా పద్ధతులు, పోపుగింజల ఉపయోగాల గురించి పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డాక్టర్ ఎస్. చంద్రశేఖర్, ఉపాధ్యాయులు ఎస్. సాదిక్వా, కలిమున్నీసా, దావూద్ హుసేన్, కాంపౌండర్ మంగమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ సేవలు

గడివేముల: ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు సచివాలయాల వద్ద ఆధార్‌సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప ఓ ప్రకటనలో తెలిపారు. 18 వతేదీన మంచాలకట్ట సచివాలయం, 19,20 తేదీల్లో బొల్లవరం, 26న ఎల్‌కే తండా, 27న ఒండుట్ల సచివాలయాల వద్ద అధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

కోడుమూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం కింద మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. సోమవారం కోడుమూరులోని మోడల్ స్కూల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ అనంతయ్యతో కలిసి తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థులకు పెట్టే భోజనాన్ని ప్రతిరోజు ఉపాధ్యాయులు పరిశీలించాలన్నారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రిన్సిపాల్ ఆశాజ్యోతికి ఎంఈఓ సూచించారు.

సెలవుల్లో సమాజాన్ని చూపిద్దాం!

- సినిమాలు, షాపింగ్‌లు ఒక్కటే కాదు...
- పిల్లలకు కుటుంబ ఆప్యాయతలను తెలియజేయాలి
- పోలీసు, ఫైర్, హాస్పిటళ్లకు తీసుకెళ్లాలి
- తల్లిదండ్రులే పిల్లలకు రోల్ మోడల్ కావాలి
- స్విమ్మింగ్, సైక్లింగ్, ఆటల్లో తర్ఫీదు ఇప్పించాలి



కర్నూలు(సెంట్రల్): మరో వారం రోజుల్లో పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించనున్నారు. ఇప్పటికే చిన్న పిల్లల తరగతులకు సెలవులు ఇచ్చారు. ఇంకేముంది ఇళ్లలో పిల్లల అల్లరే అల్లరి. ఎగరడం, దూకడం, నవ్వడం, ఏడవడం ఇలా ఏమి చేసినా పిల్లల అల్లరే కనిపిస్తోంది. వారి అల్లరి పోరును భరించలేక సినిమాలు, షాపింగ్‌లకు తిప్పి తప్పించుకోవడం తల్లిదండ్రుల బాధ్యత కాదు. వారిలో సామాజిక స్పృహను పెంచి భావి భారత పౌరుడిగా తయారు చేయాలి. స్వయంగా తల్లిదండ్రులే పిల్లలకు రోల్ మోడల్‌గా ఉండి సమాజంపై అవగాహన కల్పించాలి. వివిధ సంస్థల పనితీరు, వాటి బాధ్యతలను వివరించాలి. వారి మనసులో ఏముందో తెలుసుకోవాలి. ఆత్మస్థైర్యం కోసం ఈత, సైక్లింగ్, ఆటలను నేర్పాలి. దేశానికి అన్నం పెట్టే రైతన్న, వృద్ధులు, రోగులు పడే ఇబ్బందులు, కుటుంబ ప్రేమానురాగాలు, మత సామరస్యంపై అవగాహన పెంచితే భవిష్యత్‌లో ఉత్తమ పౌరుడిగా రాణించేందుకు అవకాశం ఉంటుంది.

తల్లిదండ్రులదే బాధ్యత...

ఒక పిల్లవాడు ఉత్తమ పౌరుడిగా రాణించాలన్నా, చెడు వ్యసనాల జోలికి వెళ్లాలన్నా వాడి పెంపకంపై ఆధారపడి ఉంటుంది. చిన్న తనం నుంచే పిల్లలను తల్లిదండ్రులు సరైన మార్గదర్శకత్వంలో పెంచితే ఉత్తమ పౌరులుగా తయారవుతారు. అదే వారిపై చిన్నచూపు చూస్తే సంఘ విద్రోహ శక్తిగా మారే ప్రమాదం ఉంది. అంటే పిల్లల నడవడిక తల్లిదండ్రులపై ఆధారపడి ఉంటుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు పిల్లల కోర్కెలకు అనుగుణంగా నడుచుకోవాలి. ముందు వారి మనసులో ఏమి ఉందో తెలుసుకోవాలి. అందుక నుగుణంగా వారికి కావాల్సిన వాటిని సమకూర్చాలి. ఇందులోనూ ఉత్తమైన లక్షణాలను పెంపొందించే వాటికే ప్రాధాన్యం ఇచ్చి మిగతా వాటిని మరిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుంది. ఉదాహరణకు ఒక పిల్లవాడు క్లాసులో తన స్నేహితుడి పెన్సిల్ లేదా స్కేల్ చోరీ చేశాడనుకుంటే దానిని మైమరపించాలి. లేదంటే వాడు భవిష్యత్‌లో దొంగగా మారే ప్రమాదం ఉంది. అదే బాలుడు స్నేహితులతో కలసి మంచి పుస్తకాలు చదువుకోవడానికి ఆసక్తిని కనబరిస్తే ప్రోత్సహించాలి. పిల్లలు పెరిగి పెద్ద అయ్యే సమయంలో వారి చుట్టూ ఉన్న స్నేహితులు, బంధువుల నడవడికను గమనించాలి. వారు చేసే పనులపై ఒక కన్ను వేసి ఉంచాలి. కాలేజీకి వెళ్లాడనో..ఉద్యోగం చేస్తున్నాడనో ఆటువైపు చూడకుండా తల్లిదండ్రులు వదిలివేస్తే సంఘ విద్రోహ శక్తులుగా మారే ప్రమాదం ఉంది. నిత్యం పిల్లలు ఏమి చేస్తున్నారో తెలుసుకోవడానికి తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇవ్వాలి.

పిల్లల్లో సామాజిక స్పృహ పెంచే కొన్ని అంశాలు

ఆత్మస్థైర్యం: చిన్నతనం నుంచే పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపాలి. సముద్రాలు, నదులు, కాలువల్లో కొట్టుకుపోకుండా తనంతకు తానే బయటపడే విధంగా ఈత నేర్పాలి. అంతేకాక భారతం, రామాయణం, భగవద్గీత, ఖురాన్, బైబిల్ గ్రంథాలను వీలు చూసుకొని చదివించాలి. అందులోని పాత్రల్లో వారు మైమరచిపోయేవిధంగా చేస్తే ఆత్మస్థైర్యంతో జీవితంలో ఏ సమస్యనైనా ఎదుర్కొనే శక్తి వారికి వస్తుంది.

రోల్ మోడల్: పిల్లలకు తల్లిదండ్రులే రోల్ మోడల్ అనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు. ఇందుకోసం వారు అనుకరించేలా కొన్ని పనులను పెద్దలు చేయాల్సి ఉంటుంది. రక్తదానం, చెట్ల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, జాతీయ ఆస్తుల సంరక్షణ, సమాజహితం కోసం పాటుపడాలనే లక్షణాలను తల్లిదండ్రులు పెంపొందించుకుంటే వారిని పిల్లలు అనుకరించే అవకాశం ఉంది.

ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రస్తుతం సమాజంలో ప్రమాదాల్లో మరణిస్తున్న వారి సంఖ్య ఏటేటా పెరిగిపోతోంది. ఎక్కువగా 20-25 ఏళ్ల మధ్య ఉన్న కుర్రాళ్లు మృతులుగా ఉంటున్నారు. అందులోనూ ఎక్కువగా అతివేగం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందుకోసం తల్లిదండ్రులు తమపిల్లలను హాస్పిటళ్లకు తీసుకెళ్లి రోడ్డు ప్రమాదాలు ఎలా జరుగుతున్నాయో..ఎందుకు జరుగుతున్నాయో తెలిసేలా చేస్తే వారిలో చిన్నతనం నుంచే మార్పు వచ్చే అవకాశం ఉంటుంది

కుటుంబ ఆప్యాయతలు...

ప్రస్తుతం ఒంటరి కుటుంబాలే అనేకం. ఉమ్మడి కుటుంబాల సంస్కృతి కనుమరుగవుతున్న నేపథ్యంలో ఎక్కడున్నా తమ సొంత ఊరికి సెలవుల్లో పిల్లలను తీసుకెళ్లాలి. అక్కడ తాతయ్య, అమ్మమ్మ, బామ్మలు, అత్తలు, మామలు, బాబాయ్‌ల ఆప్యాయతను రుచి చూపించాలి. అందరూ కలసిమెలసి ఉంటే కలిగే ప్రయోజనాలను వివరించాలి. వ్యవసాయం అంటే ఏమిటి? రైతు ఎంతకష్టపడితే తిండి తింటున్నామో, పదార్థాలను వృథా చేయడం తప్పు అని వారే తెలుసుకునేలా చేయాలి.

వివిధ సంస్థల పనితీరు తెలిసేలా..

పిల్లలకు దగ్గరలోని పోలీసు స్టేషన్లు, ఫైర్‌స్టేషన్లు, కోర్టు, జైలుకు తీసుకెళ్లి వాటి పనితీరుపై అవగాహన కల్పించాలి. జైలులోని శిక్షలు వాటి గురించి అవగాహన వస్తే వారు అలాంటి తప్పులు చేయకుండా ఉండడానికి వీలు ఉంటుంది. అంతేకాక బ్యాంకులు, పోస్టాఫీసులు, మీసేవ కేంద్రాలు తదితర వాటి పనితీరును వివరిస్తే భవిష్యత్‌లో వాటి సేవలను సులభంగా వినియోగించుకునే అవకాశం ఉంది.

మత సామరస్యం గురించి..

పిల్లలను అన్ని మతాల దేవాలయాలకు తీసుకెళ్లాలి.అక్కడ ఏ మతానికి సంబంధించిన విషయాలను పిల్లలకు చెప్పాలి. అన్నిమతాలు ప్రేమించమనే చెప్పాయని, ద్వేషించమని ఏ మతమూ చెప్పడం లేదని తెలియజేస్తే వారు భవిష్యత్‌లో మత సామరస్యాన్ని పాటించే అవకాశం ఉంది. పెద్దలపై గౌరవం కోసం వృద్ధాశ్రమాలు, అనాథశ్రమాలను పిల్లలకు చూపించాలి.

సమాజం గురించి పిల్లలకు తెలపాలి



ప్రస్తుతం సమాజంలో పిల్లల పరిస్థితి తలుచుకుంటే భయంగా ఉంది. పుట్టిన పిల్లవాడి దగ్గర నుంచి సెల్‌ఫోన్లు, వీడియో గేమ్స్, ఆడియోలు, కిడ్స్ చానళ్లను వీడడంలేదు. వాటిలో చూపించే ఫైటింగ్‌లు, కాల్పడాలు, చంపడాలపై పిల్లలు ఎక్కువగా ఆసక్తిని పెంచుకుంటున్నారు. ఇది చాలా ఆందోళన కలిగించే విషయం. వాటిన్నింటిపై పిల్లల మనసును మళ్లించాలంటే తల్లిదండ్రులు పిల్లలకు బుక్ రీడింగ్ అలవాటు చేయాలి. మత సామరస్యం , సంస్థల పనితీరు, కుటుంబ ఆప్యాయతలు, వృద్ధులను గౌరవించడం కోసం స్వయంగా వారిని సంబంధిత ప్రదేశాలకు తీసుకెళ్లాలి. ఇందుకు దసరా, సంక్రాంతి, వేసవి సెలవులను వినియోగించుకోవాలి.

– పి.మారుతి, కవి, రచయిత, కర్నూలు

ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తాం



పిల్లల కోసం సమ్మర్‌లో ప్రత్యే క్యాంపులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. వారి అభిరుచిని బట్టి స్టేడియాల్లో యోగ, పుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, క్రికెట్, ఇతర విభాగాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆటలతో పిల్లల్లో మానసిక, శారీరక శక్తి వృద్ధి చెందుతుంది. తల్లిదండ్రులే పిల్లలను ఆటల్లో రాణించేలా ప్రోత్సహించాలి.

– టీవీ రమణ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్, కర్నూలు

గ్యాస్ వినియోగంపై అవగాహన అవసరం

కోడుమూరు రూరల్: గ్యాస్‌స్టవ్‌ల వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక కేంద్రం ఎస్‌ఐ మహబూబ్ దౌలత్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని నాగార్జున హైస్కూల్లో ఎంఈఓ అనంతయ్య ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది గ్యాస్ లీకేజీ, అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో పాటించవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించే వస్తువులకు పిల్లలు దూరంగా ఉండాలన్నారు. అనంతరం గ్యాస్ సిలిండర్ వద్ద మంటలు చెలరేగినప్పుడు ఎలా ఆర్పాలో ప్రదర్శన ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో నాగార్జున హైస్కూల్ కరస్పాండెంట్ నాగార్జున యాదవ్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



మంటలను ఆర్పడంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వై.ప్రకాష్‌రెడ్డి



కర్నూలు(లీగల్) : కర్నూలు నాలుగో అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా యామసాని ప్రకాష్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఆయన కర్నూలు జిల్లా నాలుగో అదనపు జిల్లా కోర్టు (ఫ్యామిలీ కోర్టు)లో బాధ్యతలు స్వీకరించారు. ప్రాసిక్యూషన్ తరఫున తన వాదనలు వినిపించనున్నారు. ఈయన 1995వ సంవత్సరం కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకుని తన వృత్తిని కొనసాగిస్తున్నారు. సీనియర్ న్యాయవాది ఎ.రామసుబ్బారెడ్డి దగ్గర కొంతకాలం జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. ఈయన ఈ పదవిలో మూడు సంవత్సరాలు కొనసాగనున్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం



కొత్తకోటలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే సుధాకర్

సి.బెళగల్: పేదల అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. సోమ వారం మండలంలోని కొత్తకోట గ్రామంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గడపగ డపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ వైస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. అలాగే గ్రామస్తులు తెలిపిన సమస్యలను నోట్ చేసుకుని అక్కడికక్కడే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాకా రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. అవినీతికి తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ మూడున్నరేళ్లలో ప్రతి కుటుంబానికి దాదాపుగా లక్ష రూపాలయ నుంచి మూడు లక్షల రూపాలయల వరకు లబ్ధి చేకూరిందని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను గ్రామాల్లోనే అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు మనిమోహన్‌రెడ్డి, ఎంపీడీఓ రాముడు, తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఈఓఆర్డీ సందీప్, ఎస్‌ఐ పీరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, హౌసింగ్, పీఆర్ ఏఈలు గోసేనాయక్,, సుమంత్, గంగరాజు, పశువైద్యుడు సుంకన్న, ఏపీఓ లక్ష్మన్న, వైకేపీ ఎంపీఎం వెంకటస్వామి, వైస్సార్‌సీపీ నాయకులు తెలుగు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మొబైల్‌కు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అతికిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

రాష్ట్రంలో సంక్షేమ పాలన

కర్నూలు(న్యూటౌన్) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం రాత్రి కర్నూలు మండలం ఎదురూరు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్‌ను లబ్ధిదారులకు అందజేసి వారి అనుమతితో ఇంటికి, మొబైల్ ఫోన్లకు స్టిక్కర్లు అతికించారు. అనంతరం గ్రామంలోని సీతారాములు, మహాశివలింగాన్ని ఆయన దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆంజనేయ, వీరభద్ర, రామేశ్వరస్వామి ఆలయాల చైర్మన్ బోయ వెంకటేశ్వర్లు, ఎదురూరు గ్రామ ప్రజలు రేపల్లె సామ్యేల్, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మహిళలకు సంక్షేమ పథకాల క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో నవరత్నాల పేరుతో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 35వ వార్డు పరిధిలోని చింతల ముని నగర్‌లో స్థానిక కార్పొరేటర్ మాధురి, వార్డు ఇన్‌చార్జ్ వీరయ్య ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది,వలంటీర్లు సక్రమంగా సేవలు అందిస్తున్నారా అని ఆరా తీశారు.కొందరు తమ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని ఎమ్మెల్యేకు విన్నవించగా సానుకూలంగా స్పందించారు. అనంతరం వక్ఫ్ బోర్డు మసీదు వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంజాన్ ఈద్ నమాజ్‌కు పాతఈద్గా,కొత్త ఈద్గాలలో స్థలం సరిపోకపోతుండటంతో ఈ ఏడాది కల్లూరు చెన్నమ్మ సర్కిల్ సమీపంలోని మస్జీదే హాజరత్ మౌలానా యూసుఫ్ సాబ్ రహమతుల్లా అలై మసీదులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారన్నారు.పరిసర ప్రాంతాల్లోని ముస్లింలు నమాజ్‌కు ఈ మసీదును వినియోగించుకోవాలన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్ధా రేణుక, కార్పొరేటర్లు సానశ్రీనివాసులు, డీఎల్ కాంతారెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు ముల్లా హుస్సేన్ సాహెబ్, శివ, బాలచంద్రారెడ్డి, హనుమంతయ్య, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్కపురంలో..

కల్లూరు: మండల పరిధిలోని కె.మార్కపురం గ్రామంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీవీ రమణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారని మండల స్థాయి అధికారులందరూ పాల్గొనాలని సూచించారు.

స్పోర్ట్స్

22 నుంచి షూటింగ్ బాల్ పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 22, 23 తేదీల్లో అనంతపురం పట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ చాటాలని కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, ఓర్వకల్లు సర్పంచ్ అనూష అన్నారు. సోమవారం స్థానిక బి. క్యాంపు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశరాముడు, నాగరాజు పాల్గొన్నారు.

సీనియర్ హాకీ జట్టు ఎంపిక

కర్నూలు (టౌన్) : హాకీ కర్నూలు సీనియర్ జట్టును సోమవారం ఆ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ ప్రకటించారు. ఎంపికైన వారిలో జయరాముడు, శ్రావణ్‌కుమార్, మధు, ఓబులేష్, వీరేష్, వాస్, రవికుమార్, దినేష్, శివాంజనేయులు, రాఘవ, చిన్న ఉరుకుంద, మధు పెద్దయ్య, జమ్ములయ్య, రవికుమార్ ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎంపికయిన సీనియర్ హాకీ జట్టు ఈనెల 21 నుంచి 24 వరకు సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగే 13 వ హాకీ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందని వెల్లడించారు.

అట్టహాసంగా కబడ్డీ పోటీలు

గూడూరు: పట్టణంలో తిమ్మగురుడు స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని విష్ణు సేన ఆధ్వర్యంలో సోమవారం అంతరాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. లింగమయ్య కట్ట మైదానంలో జరిగిన ఈ పోటీలకు టీడీపీ కోడుమూరు మాజీ ఇన్‌చార్జ్ డి.విష్ణువర్ధన్ రెడ్డి అతిథిగా హాజరై ప్రారంభించారు. విజేత జట్లకు రూ.40,రూ.30. రూ.20 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.రామాంజనేయులు తెలిపారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

అవీ-ఇవీ

రేపు కర్నూలు మండల మీట్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశం ఈనెల 19వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎన్. భాస్కర్‌నాయుడు తెలిపారు.జెడ్పీలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ధర్మవరం వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ సింగరి సంజీవ్‌కుమార్, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారన్నారు.

దేవుడి మాన్యం కౌలుకు ఇస్తాం

కల్లూరు:సల్కాపురం గ్రామంలో వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయానికి చెందిన భూమిని త్వరలో కౌలుకిస్తామని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం సల్కాపురం గ్రామంలో సర్వే నెం 71లో మొత్తం 15.1 ఎకరాలు స్వామి మాన్యం ఉందన్నారు. ఇది అన్యాక్రాంతమవుతుందని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు సోమవారం కల్లూరు మండల సర్వేయర్ శ్రీనివాసులు, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి సర్వే చేశారు. సర్వే భూమిలో ఉన్న రస్తాను తొలగించాలని గ్రామస్తులు వారి దృష్టికి తీసకొచ్చారు.

బస్టాండ్‌లో వసతులు కల్పించాలి

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు సోమవారం తహసీల్దార్ మల్లికార్జునరెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచినీరు, బస్‌పాస్ కౌంటర్, మరుగుదొడ్లు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి వాటి కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

సి.బెళగల్: గ్రామ అభివృద్దే లక్ష్యమని సి.బెళగల్ గ్రామ సర్పంచ్ పాండురంగన్న అన్నారు. సోమవారం మండల కేంద్రం సి.బెళగల్‌లో అంగన్‌వాడీ 7వ కేంద్రం నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను అందజేస్తూ మరోవైపు పల్లెల సంపూర్ణ అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. నాడు నేడు పథకం కింద సి.బెళగల్ అంగన్‌వాడీ 7 వ కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం రూ.16 లక్షలు మంజూరు చేసిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సునంద, ఇంజినీర్ అసిస్టెంట్ శ్రీరాములు, గ్రామ పెద్దలు సీబీ గోవింద రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



సి.బెళగల్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న గ్రామ పెద్దలు

అశోకాలో ఈ-క్యూబ్ కార్నివాల్

కల్లూరు: స్థానిక దూపాడు సమీపంలోని అశోకా మహిళ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఈ-క్యూబ్ కార్నివాల్-2023 ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎడ్యుకేషన్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎంపవర్మెంట్(చదువు-వినోదం-సాధికారత)లతో విద్యార్థినులు సందడి చేశారు. ఈ ఉత్సవాల ప్రారంభోత్సవానికి ఏపీ స్టేట్ ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శారద హాజరై రంగురంగుల బెలూన్స్‌ని గాల్లోకి వదిలి ఉత్సవాలను ప్రారంభించారు. మొదటి రోజున కార్యక్రమంలో భాగంగా ఈటింగ్ కాంపిటీషన్, సింగింగ్, డ్యాన్సింగ్, మిస్ అశోకా, స్లో స్కూటీ రేస్ కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ హరీస్ కృష్ణా, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్సవాల్లో విద్యార్థినులు